సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

మంగళవారం । 11 । జూలై । 2023



తగ్గిన చీనీ ధర

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.18 వేలు పలికాయి. మార్కెట్‌కు 933 టన్నుల కాయలు అమ్మకానికి వచ్చాయి.



అలరించిన కచేరీ

మారిషస్ భక్తుల సత్యసాయి కీర్తనలతో ప్రశాంతి నిలయం ప్రతిధ్వనించింది. సత్యసాయిని కీర్తిస్తూ సోమవారం వారు చేసిన కచేరీ అందరినీ అలరించింది. 8లో

గరిష్ఠం/కనిష్ఠం
33.2°/21.6°

జిల్లాలో సోమవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు తగ్గాయి. గాలివేగం తగ్గింది. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షం కురిసింది. నైరుతి దిశగా గంటకు 8 నుంచి 12 కిలో మీటర్ల వేగంతో గాలి వీచింది.

న్యూస్‌రీల్

తుంగభద్రకు పెరుగుతున్న వరద



బొమ్మనహాళ్: తుంగభద్ర జలాశయానికి ఎట్టకేలకు ఇన్‌ఫ్లో పెరిగింది. కర్ణాటకలోని శివమొగ్గ జిల్లా పరిధిలోని తుంగా (గాజనూరు) జలాశయం నుంచి నదికి నీటిని వదులుతున్నారు. ఈ నీరంతా నది నుంచి తుంగభద్ర జలాశయానికి వస్తోంది. సోమవారం 9,892 క్యూసెక్కులకు పైగా వరద నీరు జలాశయంలోకి వచ్చి చేరింది. గత శనివారం 274 క్యూసెక్కులు, ఆదివారం 280 క్యూసెక్కులు వస్తూ ఒకే సారి 9,892 క్యూసెక్కులకు నీరు పెరిగింది. ప్రస్తుతం 1578.79 అడుగుల నీటి మట్టంతో 3.911 టీంఎసీలు నిల్వ ఉంది. టీబీ డ్యాంకు వరద రాక మొదలవడంతో ఆంధ్ర, కర్ణాటక, తెలంగాణలోని ఆయకట్టు రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. వరినార్లు పోసి ఖరీఫ్ సాగుకు సన్నాహాలు చేసుకుంటున్నారు. ప్రస్తుతం డ్యాం నుంచి రాయబసవన కాలువకు 255 క్యూసెక్కుల నీరు వదలుతున్నారు.

నర్సాపూర్-యశ్వంతపుర మధ్య ప్రత్యేక రైళ్లు



గుంతకల్లు: ప్రయాణికుల రద్దీ దృష్ట్యా నర్సాపూర్-యశ్వంతపుర మధ్య వారాంతపు ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు దక్షిణ మధ్య రైల్వే పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ సీహెచ్.రాకేష్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. నర్సాపూర్ రైల్వే జంక్షన్ నుంచి ప్రత్యేక రైలు (రైలు నం.07151) ప్రతి మంగళవారం సాయంత్రం 6 గంటలకు బయల్దేరి బుధవారం మధ్యాహ్నం 1.30 గంటలకు యశ్వంతపురకు చేరుతుంది. తిరిగి బుధవారం మధ్యాహ్నం 3.30 గంటలకు యశ్వంతపుర జంక్షన్ నుంచి ప్రత్యేక రైలు (07152) బయల్దేరి గురువారం 8.30 గంటలకు నర్సాపూర్ జంక్షన్‌కు చేరుతుంది. ఈ రైలు పాలుకొల్లు, భీమవరం టౌన్, ఆకివీడు, కైకలూరు, గుడివాడ, విజయవాడ, గుంటూరు, నరసరావుపేట, దొనకొండ మార్కాపురం రోడ్డు, గిద్దలూరు, నంద్యాల, డోన్, అనంతపురం, ధర్మవరం, హిందూపురం, యలహంక మీదుగా రాకపోకలు సాగిస్తుంది.

నేడు చేనేత వ్యాపారుల బంద్

ధర్మవరం: చేనేత వ్యాపారులపై విజయవాడలోని ఆలయ సిల్క్స్ షోరూం యజమాని దాడికి నిరసనగా వ్యాపారులు రెండురోజుల పాటు బంద్ పాటిస్తున్నారు. ఈ మేరకు ధర్మవరం పట్టుచీరల తయారీ వ్యాపారుల సంఘం నాయకులు గిర్రాజు రవి, పోలా వెంకటనారాయణలు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళ, బుధవారాలు చేనేత దుకాణాలన్నీ మూసివేస్తున్నామని పేర్కొన్నారు. మంగళవారం ఉదయం 10.30 గంటలకు శమీనారాయణస్వామి ఆలయంలో సంఘం సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేశామని, ఈ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకుంటామని తెలిపారు. చేనేత వ్యాపారులంతా అందరూ హాజరుకావాలని కోరారు.

పోలీసు కుటుంబాలకు అండగా ఉంటాం



బాధిత కుటుంబానికి చెక్కు అందజేస్తున్న ఎస్పీ మాధవరెడ్డి

పుట్టపర్తి టౌన్: విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసు సిబ్బంది కుటుంబాలకు అన్ని విధాలుగా అండగా ఉంటామని ఎస్పీ ఎస్‌పీ మాధవరెడ్డి పేర్కొన్నారు. హోంగార్డుగా పనిచేస్తూ విధుల నిర్వహణలో గాయపడి చెన్నరాయుడు మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో చెన్నరాయుడు భార్య లక్ష్మీరంగమ్మకు రూ.10 లక్షల చెక్కును ఎస్పీ సోమవారం ఉదయం తన చాంబర్ అందజేసి, మాట్లాడారు. మృతుని కుమారుడు జగదీష్‌కు కారుణ్య నియామకం కింద హోంగార్డుగా విధుల్లోకి తీసుకుంటున్నట్లు తెలిపారు. రాష్ట్ర పోలీస్ కార్యాలయం నుంచి రూ.10 లక్షలు గ్రూప్ ఇన్సూరెన్స్ కింద మంజూరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఓ సుజాత, హోంగార్డు ఆర్ఐ శ్రీశైలంరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.



అనంతపురం క్లాక్ టవర్ వద్ద నిరసన తెలుపుతున్న వలంటీర్లు

మాటలు.. మంటలు

- పవన్ వ్యాఖ్యలపై నిరసనాగ్రహం

అమ్మాయిల అదృశ్యం, మహిళల అక్రమ రవాణాకు వలంటీర్లు కారణమంటూ జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ చేసిన అనుచిత వ్యాఖ్యలపై గ్రామ, వార్డు వలంటీర్లు భగ్గుమన్నారు. సోమవారం ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా నిరసనలు తెలియజేశారు. ఉరవకొండ, బెళుగుప్ప, కనగానపల్లి, రామగిరి పోలీసుస్టేషన్లలో ఫిర్యాదు చేశారు. పుట్లూరు, గుత్తిలో నిరసన వ్యక్తం చేశారు. అనంతపురం, రాయదుర్గం, సోమందేపల్లి, ఆత్మకూరు, పరిగి, కళ్యాణదుర్గంలో పవన్ దిష్టిబొమ్మ దహనం చేశారు. వలంటీర్లకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

– సాక్షి నెట్‌వర్క్



పరిగిలో పవన్‌కళ్యాణ్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న వలంటీర్లు

‘పల్లపు’ల భూదందా

టీడీపీ హయాంలో తమ్ముళ్ల అక్రమాలు అన్నీఇన్నీ కావు. కొండలు, గుట్టలనూ కొందరు కబ్జా చేస్తే...మరికొందరు ఖాళీ జాగా కనబడితే పాగా వేసేశారు. అధికారాన్ని అడ్డం పెట్టుకొని కుటుంబీకులు, బంధువుల పేర్లతో అసైన్డ్ భూములు సొంతం చేసుకున్నారు. ఇలా బుక్కపట్నం మండలం రామసాగరానికి చెందిన పల్లపు రవీంద్ర, ఆయన సోదరుడు శంకర్ భూదందాల్లో ఆరితేరిపోయారు. ఏకంగా 40 ఎకరాలు కొట్టేసిన ఘనులు...తాజాగా సాగుదారులకు తెలియకుండా రికార్డుల్లో పేర్లుమార్చేశారు. బాధితుడు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేయడంతో వీరి భూదందా వెలుగుచూసింది.

- భూదందాల్లో ఆరితేరిన పల్లపు రవీంద్ర, పల్లపు శంకర్
- గతంలోనే 40 ఎకరాలకు పట్టాలు
- తాజాగా 5 ఎకరాల పట్టా భూమి కబ్జా
- తన పేరుపై రికార్డుల్లోకి ఎక్కించుకున్న శంకర్
- 1బీ పొంది భార్య పేరున రిజిస్ట్రేషన్
- తహసీల్దార్‌ను ఆశ్రయించిన బాధితులు



నిమ్మలతో రవీంద్ర (మాస్కు వేసుకున్న వ్యక్తి), శంకర్ (ఫుల్ షర్టు వేసుకున్న వ్యక్తి)



తహసీల్దార్ కరుణాకర్‌కు ఫిర్యాదు చేస్తున్న హక్కుదారులు

పుట్టపర్తి: బుక్కపట్నం మండలం రామసాగరానికి చెందిన పల్లపు రవీంద్ర, ఆయన సోదరుడు శంకర్ టీడీపీలో కీలక నేతలుగా వ్యవహరిస్తున్నారు. వీరిద్దరూ మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, మాజీ ఎంపీ నిమ్మల కిష్టప్పకు అత్యంత సన్నిహితులు. పల్లపు రవీంద్ర శ్రీసత్యసాయి జిల్లా వడ్డెర్ల సంఘం అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. టీడీపీ హయాంలో భారీగా భూదందా చేసిన సోదరులు..తాజాగా ఐదు ఎకరాల పట్టాభూమిని కబ్జా చేశారు. రికార్డుల్లో పేర్లుమార్చేసి సొంతం చేసుకున్నారు.

1బీ పొంది భార్యపేరుతో రిజిస్ట్రేషన్..

బుక్కపట్నం మండలం కొత్తకోట గ్రామం పొలం సర్వే నంబర్–381లో మొత్తం 8.35 ఎకరాల భూమి ఉంది. ఇది పట్టా భూమి. పూర్వం నుంచి యర్లంపల్లికి చెందిన ఆదిలక్ష్మమ్మ, అంజనప్ప, చెన్నకృష్ణ, చంద్రశేఖర్ సాగుచేసుకుంటున్నారు. ఈ సర్వే నంబరుపై వీరికి విడివిడిగా 1బీలు కూడా ఉన్నాయి. ఈ ఐదెకరాలపై పల్లపు సోదరులు కన్నేశారు. పల్లపు రవీంద్ర సహకారంతో అతని సోదరుడు పల్లపు శంకర్ 2020లో 4.50 ఎకరాలకు ఖాతా నంబర్ 1,265ను అక్రమంగా పొందాడు. ఇందుకోసం అధికారులను మ్యానేజ్ చేసి రికార్డులు తారుమారు చేయించాడు. ఆ తర్వాత తన పేరు మీద ఎలాంటి ఆధారాలూ లేకపోవటంతో భవిష్యత్‌లో ఇబ్బందులు తలెత్తుతాయని భావించిన శంకర్ ఆ వెంటనే భూమిని పల్లపు పార్వతి పేరుతో బుక్కపట్నం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేయించాడు. అప్పటి నుంచి రికార్డుల్లో పార్వతి పేరు చేరింది. ఇటీవల ఈ విషయం తెలుసుకున్న అసలైన భూ యజమానులు సోమవారం బుక్కపట్నం తహసీల్దార్ కరుణాకర్‌ను కలిసి తమ గోడు వెళ్లబోసుకున్నారు. భూమికి సంబంధించిన ఆధారాలు చూపించి వెంటనే అక్రమాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, రికార్డుల్లోని వారి పేర్లను తొలగించాలని కోరారు.



పల్లపు శంకర్



పల్లపు రవీంద్ర

పట్టాదారు పేరు	గ్రామ పొలం	సర్వే నంబర్లు-	విస్తీర్ణం (ఎకరాల్లో)
పల్లపు రవీంద్ర	మారాల	270-ఏ	5.0000
పి.రవీంద్ర	మంగలమడక	411-1	5.0600
గోగుల కృష్ణవేణి	మారాల	414-6	4.3800
పి.కృష్ణవేణి	మంగలమడక	420-2	5.0000
పల్లపు శివశంకర్	మారాల	270ఏ	5.0000
పల్లపు శంకర్	మంగలమడక	411-2ఏ	5.6000
దండిగల జానకమ్మ	మారాల	414-5	4.3800
పల్లపు జానకి	మంగలమడక	420-1	5.1000

గతంలోనూ రవీంద్ర జాలం..

పల్లపు సోదరులు గతంలోనూ భారీగా అసైన్డ్‌భూములకు పట్టాలు పొందారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ఒక్కో కుటుంబానికి 5 ఎకరాల వరకూ అసైన్డ్ పట్టా ఇవ్వవచ్చు. కానీ పల్లపు రవీంద్ర, భార్య కృష్ణవేణి, సోదరుడు శంకర్, అతని భార్య జానకి పేరుతో మారాల, ముదిగుబ్బ మండలం మంగలమడక గ్రామ పొలంలో 40 ఎకరాలు అసైన్డ్ భూమికి పట్టాలు పొందారు. బుక్కపట్నం మండలం మారాల పొలంలో 19 ఎకరాలకుపైగా, ముదిగుబ్బ మండలం మంగలమడక పొలంలో మరో 19 ఎకరాలకుపైగా అసైన్డ్ భూములు కొట్టేశారు. ఇలా వీరు పొందిన భూముల్లో పంటలు సాగు చేసుకోక పోయినా ప్రభుత్వం నుంచి వచ్చే లబ్ధి మాత్రం సొమ్ముచేసుకుంటున్నారు.

14న పెనుకొండలో జాబ్‌మేళా

- పోస్టర్లు ఆవిష్కరించిన కలెక్టర్ అరుణ్‌బాబు



జాబ్ మేళా పోస్టర్లు విడుదల చేస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు, జేసీ చేతన్ తదితరులు

పుట్టపర్తి అర్బన్: ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 14న పెనుకొండ పీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు కలెక్టర్ అరుణ్‌బాబు తెలిపారు. సోమవారం ఆయన కలెక్టరేట్‌లోని స్పందన సమావేశ మందిరంలో జాబ్‌మేళా పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, నిరుద్యోగ యువత కోసం ప్రతి నెలా రెండో శుక్రవారం స్కిల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో జిల్లాలోని పలు ప్రాంతాల్లో జాబ్‌మేళాలు నిర్వహిస్తున్నామన్నారు. 14వ తేదీ ఉదయం 9 గంటల నుంచి నిర్వహించే జాబ్‌మేళాలో 12 కంపెనీలు పాల్గొంటున్నాయన్నారు. 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, డిప్లొమా, బీటెక్ చదివిన విద్యార్థులు జాబ్‌మేళాలో పాల్గొనవచ్చన్నారు. గత నెల హిందూపురంలో నిర్వహించిన జాబ్ మేళాలో 250 మందికిపైగా ఉద్యోగాలు పొందారన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ చేతన్, డీఆర్ఓ కొండయ్య, ఆర్డీఓ భాగ్యరేఖ, స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి అబ్దుల్ ఖయ్యూం, పీఆర్ ఎస్ఈ గోపాల్‌రెడ్డి, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, డీఎంహెచ్ఓ కృష్ణారెడ్డి, హౌసింగ్ పీడీ చంద్రమౌళిరెడ్డి, జిల్లా ఉద్యానశాఖ అధికారి చంద్రశేఖర్, ఏపీఎంఐపీ పీడీ సుదర్శన్, పట్టు పరిశ్రమ శాఖ జేడీ పద్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

పవన్‌కు బడితె పూజ ఖాయం

- ఉన్మాదిలా మాట్లాడితే సహించం
- ఎమ్మెల్యే శంకరనారాయణ హెచ్చరిక
- వలంటీర్లకు క్షమాపణ చెప్పాలని డిమాండ్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకరనారాయణ, చిత్రంలో ఏడీసీసీ బ్యాంక్ చైర్‌పర్సన్ లిఖిత

పెనుకొండ: ‘‘పవన్ కళ్యాణ్‌కు మతిభ్రమించింది. మేకప్ వేసుకుని సినిమాల్లో డైలాగ్‌లు చెప్పినట్లు రాజకీయ వేదికలపై ఉన్మాదిలా నోటికి ఏది వస్తే అది మాట్లాడుతున్నారు. పిచ్చోడిలా ఊగిపోతూ ఎంతమాటంటే అంత అంటున్నారు. ఎవరిని ఏం అంటున్నాడో తెలియకుండా వాగేస్తున్నాడు. ఇన్నాళ్లూ మేము పెద్దగా పట్టించుకోలేదు. కానీ ఇక సహించం. మారోసారి నోరుజారితే అతనికి బడితె పూజ చేయడం ఖాయం’’ అని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, పెనుకొండ ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ హెచ్చరించారు. సోమవారం ఆయన పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో ఏడీసీసీ బ్యాంక్ చైర్‌పర్సన్ లిఖితతో కలిసి విలేకరులతో మాట్లాడారు. పవన్‌కళ్యాణ్ అనే వ్యక్తి హైదరాబాద్‌లో కాకుండా ఆంధ్రప్రదేశ్‌లో నివాసం ఉంటే, అతని ఇల్లు ఏదో ఒక వలంటీర్ పరిధిలోకి వచ్చేదని, అప్పుడు వలంటీర్ల సేవలు తెలిసేవన్నారు. కరోనా లాంటి కష్టకాలంలోనూ ప్రతి ఇంటికి వెళ్లి వలంటీర్లు నిస్వార్థ సేవలందించారని, సంక్షేమ పథకాలను అర్హులకు అందించడంలో వలంటీర్లదే కీలక పాత్ర అన్నారు. అందువల్లే వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. కానీ పవన్ కళ్యాణ్ మాత్రం అక్కసుతో వలంటీర్లపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో మహిళల మిస్సింగ్ కేసులు అధికంగా ఉన్నాయని పవన్ కళ్యాణ్ పేర్కొనడం అతని దిగజారుడు రాజకీయానికి నిదర్శనమన్నారు. నిస్వార్థంగా సేవాభావంతో పనిచేసే వలంటీర్లకు వెంటనే అతను క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నగర పంచాయతీ చైర్మన్ ఉమర్‌ఫారూక్‌ఖాన్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నాగలూరుబాబు, నాయకులు రామ్మోహన్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, మారుతి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యాన రైతుకు ‘ఉపాధి’ సాయం



ఎమ్మెల్యే కార్యాలయం వద్ద పండ్ల మొక్కలను అందజేస్తున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి



కలెక్టరేట్ వద్ద మొక్కలు పంపిణీ చేస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

- మొక్కలతో పాటు సూక్ష్మ సేద్య పరికరాలూ అందిస్తాం
- కలెక్టర్ అరుణ్‌బాబు, ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి
- డ్రైల్యాండ్ హార్టికల్చర్ కింద పండ్ల మొక్కల అందజేత

పుట్టపర్తి అర్బన్: డ్రైల్యాండ్ హార్టికల్చర్ కింద పండ్ల మొక్కలు సాగుచేసే రైతులకు ఉపాధి హామీ ద్వారా తగిన ప్రోత్సాహకాలు అందిస్తామని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, కలెక్టర్ అరుణ్‌బాబు తెలిపారు. సోమవారం డ్వామా ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి, కలెక్టరేట్ వద్ద కలెక్టర్ అరుణ్‌బాబు ఉద్యాన రైతులకు మామిడి, చీనీ, నిమ్మ, జామ, సపోటా, చింత, డ్రాగన్ ఫ్రూట్ , గులాబీ తదితర మొక్కలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, డ్రైల్యాండ్ హార్టికల్చర్ కింద పండ్ల తోటలు సాగు చేసే రైతులకు ప్రభుత్వం ఉపాధి హామీ ద్వారా లబ్ధి చేకూరుస్తోందన్నారు. మెట్ట భూముల్లో పండ్ల తోటలసాగుకు దరఖాస్తు చేసుకున్న రైతులకు అధిక దిగుబడినిచ్చే పండ్ల మొక్కలను అందజేస్తున్నట్లు వెల్లడించారు. 2022–23 సంవత్సరానికి సంబంధించి జిల్లాలోని 2,366 మంది రైతులు దరఖాస్తు చేసుకోగా, వీరి కోసం వివిధ నర్సరీల నుంచి 50 వేలకుపైగా మొక్కలను తెప్పించినట్లు చెప్పారు. ఇంకా ఎవరైనా అర్హులు ఉంటే దరఖాస్తు చేసుకోవాలని డ్వామా పీడీ రామాంజనేయులు సూచించారు. ఐదుఎకరాల్లోపు భూమి ఉండి, ఉపాధి హామీ పథకంలో లబ్ధిదారులకు మాత్రమే ఈ పథకం వర్తిస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా అగ్రి అడ్వయిజరీ బోర్డు చైర్మన్ అవుటాల రమణారెడ్డి, డ్వామా పీడీ రామాంజనేయులు, ఉద్యానశాఖ అధికారి చంద్రశేఖర్, ఏపీడీ రఘునాథరెడ్డి, ప్లాంటేషన్ మేనేజర్ వెంకప్ప, ఎంపీడీఓలు, ఏపీఓలు, యూత్ నాయకులు గోవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

త్వరలోనే నియోజకవర్గ సమీక్షలు

- ఎమ్మెల్యేల ఆధ్వర్యంలో జరిగే సమావేశాలకు వివరాలు సిద్ధం చేయాలి
- ‘జగనన్నకు చెబుదాం’పై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలి
- కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశం



స్పందనలో అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు, జేసీ చేతన్

పుట్టపర్తి అర్బన్: జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో జరిగిన అభివృద్ధి, నెలకొన్న సమస్యలపై త్వరలోనే సమీక్ష సమావేశాలు ఉంటాయని, ఎమ్మెల్యేలతో జరిగే ఈ సమావేశాలకు అన్ని వివరాలతో సిద్ధంగా ఉండాలని కలెక్టర్ అరుణ్‌బాబు అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన జాయింట్ కలెక్టర్ చేతన్, డీఆర్ఓ కొండయ్య, ఆర్డీఓ భాగ్యరేఖలతో కలిసి కలెక్టరేట్‌లోని స్పందన సమావేశ మందిరంలో నిర్వహించిన ‘స్పందన’లో పాల్గొన్నారు. వివిధ సమస్యలపై ప్రజల నుంచి 251 అర్జీలు అందగా, వాటి పరిష్కారానికి ఆయా శాఖలకు పంపారు. వెంటనే డివిజన్, మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతరం వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, నియోజకవర్గాల సమీక్షలకు జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి, ఎమ్మెల్యేలు హాజరవుతారన్నారు. ఆయా నియోజకవర్గాల్లో నిర్వహించే సమావేశాల్లో తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్, హౌసింగ్ తదితర శాఖలకు సంబంధించిన అధికారులు పాల్గొనాలన్నారు. తొలుత ఈనెల 14వ తేదీన పుట్టపర్తి నియోజకవర్గానికి సంబంధించి సమావేశం ఉంటుందని, మిగిలిన నియోజకవర్గాల సమావేశాల తేదీలు త్వరలోనే ప్రకటిస్తామన్నారు. పుట్టపర్తి నియోజకవర్గానికి సంబంధించి అన్ని వివరాలను 1వతేదీ సాయంత్రంలోపు నివేదిక అందజేయాలన్నారు.

నాణ్యమైన పరిష్కారం చూపాలి..

‘జగనన్నకు చెబుదాం’, ‘స్పందన’ కార్యక్రమాల్లో అర్జీలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ ఆదేశించారు. ఒక్కసారి స్పందనలో అందిన అర్జీ మళ్లీ రాకుండా నాణ్యమైన పరిష్కారం చూపాలన్నారు. అర్జీదారుడు సంతృప్తి చెందేలా సమస్యను సకాలంలో పరిష్కరించాలన్నారు. ఇందులో అలసత్వం పనికిరాదన్నారు. అర్జీలపై సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశించారు. అలాగే ఉపాధి హామీ పథకంలో రోజూ లక్ష మందికి పనులు కల్పించాల్సి ఉండగా, ప్రస్తుతం 65 వేల మందికి మాత్రమే పనులు కల్పిస్తున్నామన్నారు. ఈ సంఖ్యను మరింత పెంచాలన్నారు. రామగిరి, పెనుకొండ, రొద్దం, చిలమత్తూరు మండలాలకు కేటాయించిన లక్ష్యాల్లో 20 శాతం మాత్రమే పురోగతి ఉందని, ఆయా మండల అధికారులు వెంటనే తగు చర్యలు తీసుకోవాలన్నారు. రొళ్ల, మడకశిర అర్బన్, రూరల్, పుట్టపర్తి అర్బన్, రూరల్, కనగానపల్లి, అమరాపురం, గోరంట్ల, ఓడీసీ తదితర మండలాల్లో ‘జగనన్న సురక్ష’ కార్యక్రమం సరిగా జరగడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు.

34 ఏళ్ల తర్వాత పట్టుబడ్డాడు

- చోరీ కేసులో అరెస్టు చేసిన పోలీసులు



నిందితుడు చిన్న నాగప్ప

ఓడీ చెరువు: ఓ చోరీ కేసులో తప్పించుకు తిరుగుతున్న నిందితుడిని పోలీసులు 34 ఏళ్ల తర్వాత అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళితే...1989లో తలుపుల మండలం వేపులపల్లికి చెందిన చిన్ననాగప్ప అలియాస్ తోలుగాడు ఓడీ చెరువు స్టేషన్ పరిధిలోని అమడగూరు మండలం చెర్లోపల్లిలో ఓ ఇంట్లో చోరీ చేశాడు. రూ. 1.20 లక్షల విలువైన బంగారు ఆభరణాలను దోచుకెళ్లాడు. పోలీసులు చిన్న నాగప్పపై కేసు నమోదు చేశారు. అప్పట్లో ఎంతగా ప్రయత్నించినా పోలీసులు చిన్న నాగప్పను పట్టుకోలేక పోయారు. కాలక్రమంలో ఆ కేసును పోలీసులు కూడా దాదాపుగా మరచిపోయారు. కానీ ఈ కేసు గురించి తెలుసుకున్న కానిస్టేబుల్ కోళ్ల అంజి ఎలాగైనా చిన్న నాగప్పను పట్టుకోవాలనుకుని వెతకడం ప్రారంభించాడు. తెలిసిన వారి వద్ద వాకబు చేశాడు. ఈ క్రమంలోనే సోమవారం నిందితుడు కదిరి బస్టాండ్ వద్ద ఉన్నట్లు తెలుసుకుని అక్కడికి వెళ్లి అదుపులోకి తీసుకున్నాడు. అనంతరం అతన్ని కోర్టులో హాజరుపరిచాడు. 34 ఏళ్లుగా తప్పించుకు తిరుగుతున్న నిందితుడిని పట్టుకున్న కానిస్టేబుల్ కోళ్ల అంజిని ఉన్నతాధికారులు అభినందించారు. చిన్న నాగప్పపై డెకాయిట్, చోరీ, మర్డర్ కేసులు ఉన్నట్లు ఎస్ఐ గోపీ తెలిపారు.

జాతీయ పురస్కారం అందుకున్న 'జాబిలి'



పురస్కారం అందుకుంటున్న జాబిలి చాంద్‌బాషా

పెనుకొండ: పట్టణానికి చెందిన సీనియర్ కవి, సాహితీవేత్త జాబిలి చాంద్‌బాషా జాతీయ పురస్కారాన్ని అందుకున్నారు. సైమన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పద్మశ్రీ ఆచార్య కొలకలూరి ఇనాక్ పేరిట జాతీయ పురస్కారాలను అందజేస్తున్న విషయం తెలిసిందే. ఈ ఏడాది పురస్కారాల ప్రదానానికి వివిధ ప్రాంతాలకు చెందిన సాహితీవేత్తలు ఎంపిక కాగా, శ్రీసత్యసాయి జిల్లా నుంచి చాంద్‌బాషా ఉండడం గమనార్హం. ఆయన రచించిన 'మట్టిని ముద్దాడిన మనిషి' కవితా సంపుటి పురస్కారానికి ఎంపిక చేశారు. ఆదివారం రాత్రి హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన పురస్కారాల ప్రదాన కార్యక్రమంలో ఈ అవార్డును ఆచార్య ఇనాక్ చేతుల మీదుగా ఆయన అందుకున్నారు. కార్యక్రమంలో పద్మశ్రీ మూర్తీదేవి, సాహితీవేత్తలు డాక్టర్ నాశేశ్వరం శంకరం, డాక్టర్ కోయి కోటేశ్వరరావు, ఇన్‌కమ్ టాక్స్ విశ్రాంత అధికారి నరసింహప్ప, బిక్కీ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు అండగా ప్రభుత్వం



ట్రైసైకిళ్లు అందజేస్తున్న ఆర్డీఓ భాగ్యరేఖ, ఏడీ అబ్దుల్ రసూల్

పుట్టపర్తి అర్బన్: దివ్యాంగులకు అండగా రాష్ట్ర ప్రభుత్వం నిలిచిందని ఆర్డీఓ భాగ్యరేఖ అన్నారు. సాటి మనిషి కష్టం, బాధ అర్థం చేసుకుని వారి కష్టంలో తోడుగా నిలుస్తూ త్రిచక్ర సైకిళ్లు, చంక కర్రలు అందజేస్తోందన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో జిల్లాలోని 16 మంది దివ్యాంగులకు త్రిచక్ర సైకిళ్లు, ఒక కాలు కోల్పోయిన 10 మందికి చంక కర్రలను ఆమె అందజేసి, మాట్లాడారు. అర్హులైన దివ్యాంగులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకుంటే మధ్యవర్తుల ప్రమేయం లేకుండానే ఉపకరణాలను ప్రభుత్వం సమకూరుస్తోందన్నారు. ఈ అవకాశాన్ని అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ అధికారి అబ్దుల్ రసూల్ పాల్గొన్నారు.

చిరుతల అలజడి



కుందుర్పి మండలం మందలపల్లికి చెందిన వెంకటేష్‌కు 200 గొర్రెలు ఉన్నాయి. జీవాల పెంపకంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల నెల రోజుల వ్యవధిలో జీవాలపై రెండుసార్లు చిరుత దాడి చేసింది. ఒక గొర్రెతో పాటు మరొక విత్తన పొట్టేలును పొట్టన పెట్టుకుంది. రూ.45 వేల దాకా నష్టం వాటిల్లింది. గ్రామ సమీపంలో అటవీ ప్రాంతం అధికంగా ఉంది. చిరుతల దాడితో జీవాల మనుగడ కష్టంగా ఉందని కాపరి వెంకటేష్ తెలిపాడు.



- మేకలు, గొర్రెల మందలే లక్ష్యం
- రెండు మాసాల్లో ఐదారు దఫాలు దాడులు
- ఉమ్మడి అనంతపురం జిల్లాలో పెరిగిన చిరుతల సంఖ్య
- గతేడాది దాడుల్లో చనిపోయిన 35 జీవాలకు పరిహారం

సాక్షి ప్రతినిధి, అనంతపురం

▶ నెల రోజుల క్రితం రాప్తాడు నియోజకవర్గం చెన్నేకొత్తపల్లి మండల పరిధిలో ఒక చిరుత హల్‌చల్ చేసింది. పగలే ఓ మందపై దాడి చేసి నాలుగైదు మేకలను చంపేసింది. చిరుతను చూసిన కాపరులు పరుగులు తీసి ప్రాణాలు రక్షించుకున్నారు.

▶ వారం క్రితం రాయదుర్గం నియోజకవర్గ పరిధిలోని ఓ గొర్రెల మందలో చిరుత విరుచుకుపడింది. ఎనిమిది గొర్రెపిల్లలను చంపేసి, ఒకదాన్ని ఆరగించింది. ఈ ఘటనతో చుట్టుపక్కల వారు భయాందోళనకు గురయ్యారు.

ఉమ్మడి అనంతపురం జిల్లాలో చిరుతలు అలజడి రేపుతున్నాయి. చిరుత పులుల సంఖ్య పెరుగుతుండటమే దీనికి కారణమని అటవీశాఖ అధికారులు భావిస్తున్నారు. రాయలసీమలోనే ఉమ్మడి అనంతపురం జిల్లాలో చిరుత పులుల సంఖ్య పెరిగిందని, అందుకు ఇక్కడి అడవులు సానుకూలంగా ఉండటమే కారణమని అభిప్రాయపడుతున్నారు. ఓ వైపు జింకల మందలు పెరుగుతున్నా సులభంగా లభించే ఆహారం కాబట్టి చిరుత పులులు ఎక్కువగా గొర్రెలు, మేకలు, ఆవుల మందలనే టార్గెట్ చేస్తున్నాయి. మరోవైపు తాజాగా డి.హీరేహాళ్ మండలంలో ఎలుగుబంటి దాడి నమోదైంది.



చిరుతదాడిలో చనిపోయిన మేక

ఇతర ప్రాంతాల నుంచీ ఇక్కడకు..

కర్నూలు, చిత్తూరు జిల్లాల్లో నల్లమల అటవీ ప్రాంతం విస్తరించి ఉంది. కానీ డీప్ ఫారెస్టు (చిక్కటి అడవులు)ల్లో చిరుత పులులు ఉండవు. వాటికి చిన్న చిన్న గుట్టలు, చిన్నపాటి చెట్లు ఉండే అడవులు ఇష్టం. ఇలాంటి ప్రాంతాలు వేటకు అనుకూలంగా ఉంటాయి. దీంతో ఆయా జిల్లాల నుంచి చిరుత పులులు శ్రీసత్యసాయి, అనంతపురం జిల్లాల్లోని చిట్టడవులకు చేరుకుంటున్నట్టు ఫారెస్టు అధికారులు గుర్తించారు. వాటి వేలిముద్రల ఆధారాలను బట్టి పరిశీలిస్తే ఇటీవలి కాలంలో ఎక్కువ సంఖ్యలో చిరుతలు ఉమ్మడి అనంతపురం జిల్లాకు చేరుకున్నట్లు తెలుస్తోంది. గత నాలుగేళ్లుగా తాగునీటికి కూడా ఇబ్బంది లేకుండా గుట్ట ప్రాంతాల్లో నీటిగుంటలు ఉండటంతో చిరుతలు ఇక్కడ స్థిరనివాసం ఏర్పరుచుకున్నట్టు సమాచారం.

బెంబేలెత్తుతున్న కాపరులు

రాయదుర్గం, రాప్తాడు, పెనుకొండ ప్రాంతాల్లో గడిచిన రెండు మాసాల్లోనే నాలుగైదుసార్లు చిరుత పులుల దాడులు నమోదయ్యాయి. దీంతో జీవాల సంఖ్య ఎక్కువగా ఉన్న ఉమ్మడి అనంతపురం జిల్లా గొర్రెలు, మేకల కాపర్లు బెంబేలెత్తుతున్నారు. గత ఏడాదిలో చిరుతల దాడిలో చనిపోయిన 35 జీవాలకు ఫారెస్టు అధికారులు పరిహారం అందజేశారు. ఈ ఏడాది ఇప్పటి వరకు 15 జీవాలను చిరుతలు పొట్టనపెట్టుకున్నట్లు తేలింది. ఈ క్రమంలో జీవాలను మేత కోసం గుట్ట ప్రాంతాల వైపు తీసుకెళ్లాలంటే కాపరులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో..	
చిరుత పులుల సంఖ్య అంచనా	35-40
జింకలు	దాదాపు 3,000
ఎలుగుబంట్లు	10-15
అనంతపురం జిల్లాలో గొర్రెలు	24,78,991
అనంతపురం జిల్లాలో మేకలు	5,00,612
శ్రీసత్యసాయి జిల్లాలో గొర్రెలు	27,49,823
శ్రీసత్యసాయి జిల్లాలో మేకలు	5,16,232

రిజర్వు ఫారెస్టులోకి వెళ్లొద్దు



రిజర్వు ఫారెస్టు పరిధిలో మేకలు, గొర్రెలను చిరుతలు చంపేస్తే పరిహారం రాదు. ఇది మూగజీవాల యజమానులు గుర్తుంచుకోవాలి. రిజర్వు ఫారెస్టు కాని ప్రాంతాల్లో దాడులు జరిగితే కచ్చితంగా పరిహారం చెల్లిస్తాం. జనావాసాలు దగ్గరగా ఉన్న ప్రాంతాల్లోనే పశువులు, గొర్రెలను మేపుకుంటే మంచిది.
– సందీప్ కృపాకర్, జిల్లా అటవీశాఖ అధికారి

గ్రామీణ మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి

- మహిళా చైతన్యానికి శ్రీజ సంస్థ కృషి అభినందనీయం
- మాజీ గవర్నర్ కిరణ్‌బేడీ వెల్లడి



రూ.10 కోట్ల బోనస్ చెక్కును అందజేస్తున్న శ్రీజ సంస్థ నిర్వాహకులు, అతిథులు

తిరుపతి కల్చరల్: గ్రామీణ మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని, ప్రధానంగా పాడి రంగంలో చిన్నపాటి ఆర్థిక ఆర్జన చేస్తున్న మహిళలను ప్రోత్సహిస్తూ వారి చైతన్యానికి శ్రీజ సంస్థ చేస్తున్న కృషి అభినందనీయమని పుదుచ్చేరి రాష్ట్ర మాజీ గవర్నర్ కిరణ్‌బేడి అన్నారు. తిరుపతి జిల్లా కరకంబాడి రోడ్డులోని ఓ ప్రైవేటు హోటల్‌లో శ్రీజ సంస్థ 10వ వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి న్యూఢిల్లీ నుంచి కిరణ్‌బేడి వర్చువల్ విధానంలో ముఖ్య అతిథిగా హాజరై శ్రీజ సంస్థ సభ్యులతో, అతిథులతో ముచ్చటించారు. దేశంలోని పాడి రైతుల ఆర్థికాభివృద్ధికి శ్రీజ వంటి సంస్థలు నెలకొల్పాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అనంతరం అతిథిగా విచ్చేసిన అమర హాస్పిటల్స్ ఎండీ గొర్నసేని రమాదేవి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత మహిళలకు ఇంతగా ప్రోత్సాహకాలు అందించి ఆర్థిక చైతన్యవంతుల్ని చేస్తున్న శ్రీజ సంస్థ కృషి అభినందనీయమన్నారు. శ్రీజ సంస్థకు తమ వంతు సహకారం అందిస్తామన్నారు. శ్రీజ సంస్థ చీఫ్ ఎగ్జిక్యూటివ్ జయతీర్థాచారి మాట్లాడుతూ 10వ వార్షికోత్సవం సందర్భంగా శ్రీజ సభ్యులకు రూ.10 కోట్ల బోనస్‌ను ఆన్‌లైన్ పద్ధతిలో నగదు బదిలీ చేయడంతో పాటు అర్హులైన వారికి స్టీలు పాల క్యాన్లు అందించినట్లు తెలిపారు. నెలలో రెండు సార్లు శ్రీజ సంస్థ సభ్యులకు నగదు చెల్లింపులు చేస్తున్నామని, ఇప్పటి వరకూ రూ.3,600 కోట్లు వారి ఖాతాలకు జమచేసినట్టు వెల్లడించారు. శ్రీజ కంపెనీ అత్యుత్తమ విజయాలకు గుర్తింపుగా ప్రతిష్టాత్మకమైన సెక్స్ సార్టెడ్ సెమన్ ప్రాజెక్టును రాయలసీమ ప్రాంతంలో అమలు చేసే ఏజెన్సీగా రాష్ట్రీయ గోకుల్ సేవా మిషన్ కింద ఎంపికైందన్నారు. ఈ ప్రాజెక్టు ఆగస్టు 15న ప్రారంభించనున్నట్లు తెలిపారు. టీఏఎస్ఎస్ మాజీ డెప్యూటీ డైరెక్టర్ డాక్టర్ లక్ష్మీలింగం, గ్రాన్యూల్స్ ఇండియా గ్లోబల్ సీహెచ్ఆర్‌వో ఉమారావు, చిత్తూరు, తిరుపతి జిల్లాల డీఆర్‌డీఏ పీడీలు, డీఎంకే తులసి, జ్యోతి, శ్రీజ సంస్థ చైర్మన్ కె.శ్రీదేవి, సిబ్బంది పాల్గొన్నారు.

అలరించిన సంగీత కచేరి



కచేరి నిర్వహిస్తున్న విదేశీ భక్తులు

ప్రశాంతి నిలయం: పర్తియాత్రలో భాగంగా పుట్టపర్తికి విచ్చేసిన మారిషస్ భక్తులు సోమవారం సంగీత కచేరితో ఆకట్టుకున్నారు. సత్యసాయిని కీర్తిస్తూ భక్తులు ఆలపించిన గీతాలు అలరించాయి. కచేరి అనంతరం భక్తులు సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.

సహకార సొసైటీలను బలోపేతం చేయాలి

- అధికారులను ఆదేశించిన కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు

పుట్టపర్తి అర్బన్: జిల్లా లోని సహకార సొసైటీలను బలోపేతం చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జరిగిన జిల్లా కో-ఆపరేటివ్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో 54 కో-ఆపరేటివ్ సొసైటీలు ఉండగా వాటిని పూర్తిగా కంప్యూటరీకరణ చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన కామన్ సర్వీస్ సెంటర్ ద్వారా సొసైటీలు ఫోన్ పే, గూగుల్ పే లాంటి 25 రకాల సేవలను అందించవచ్చన్నారు. మల్టీ పర్పస్ ఫెసిలిటీ సెంటర్ గోడౌన్‌లకు సంబంధించి మొదటి దశలో మంజూరైన 72 గోదాములూ పూర్తయ్యాయన్నారు. రెండో దశలో మంజూరైన 55 గోదాములు టెండర్ల దశలో ఉన్నాయన్నారు. మూడో దశలో మంజూరైన 115 గోడౌన్లకు సంబంధించి ఇప్పటి వరకూ 24 చోట్ల స్థలాల గుర్తింపు చేశారన్నారు. మిగిలిన వాటికి స్థల సేకరణ పూర్తి చేయాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ చేతన్, డీసీఓ కృష్ణానాయక్, సీపీఓ విజయ్‌కుమార్, పశు సంవర్ధకశాఖ అధికారి శుభదాస్, జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, పీఆర్ ఎస్‌ఈ గోపాల్‌రెడ్డి, డీసీసీబీ సీఈఓ రాంప్రసాద్, సొసైటీ సీఈఓలు, సెక్రెటరీలు పాల్గొన్నారు.

వలంటీర్లను అవమానించడం అమానుషం

- ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి

గాండ్లపెంట: ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా ఉంటూ నామమాత్రపు గౌరవ వేతనంతో నిస్వార్థ సేవలు అందిస్తున్న వలంటీర్లను అవమానించడం అమానుషమని కదిరి ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి అన్నారు. వలంటీర్లను అవమానించేలా జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలను ఆయన ఖండించారు. సోమవారం కటారుపల్లిలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. వలంటీర్ల మనోభావాలను దెబ్బ తీసేలా మాట్లాడిన పవన్ కళ్యాణ్ బేషరత్తుగా క్షమాపణ చెప్పాలన్నారు. మహిళలనే గౌరవం లేకుండా అనుచిత వ్యాఖ్యలు చేయడం సబబు కాదన్నారు. కరోనా కష్ట సమయంలో వలంటీర్లు అందించిన సేవలు చిరస్మరణీయమన్నారు.

బరి తెగింపు మాటలు సిగ్గుచేటు

- ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి

ధర్మవరం: వలంటీర్లనపై పవన్ కళ్యాణ్ బరితెగించి చేసిన వ్యాఖ్యలు సిగ్గు చేటని ధర్మవరం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి మండిపడ్డారు. కేరళ స్టోరీస్ సినిమా చూసి మాట్లాడడం సబబు కాదని హితవు పలికారు. స్థానిక తన నివాసంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో చంద్రబాబు సైతం గోనెసంచులు మోయడానికే వలంటీర్లు అంటూ హేళనగా మాట్లాడారని గుర్తు చేశారు. ప్రస్తుతం పవన్‌కళ్యాణ్ కూడా చంద్రబాబు అడుగుజాడల్లో నడుస్తూ అవే మాటలు మాట్లాడుతున్నారన్నారు. వలంటీర్ వ్యవస్థలో 50 శాతానికి పైగా మహిళలే ఉన్నారని, అలాంటి మహిళా లోకాన్ని కించపరిచేలా దిగజారుడు రాజకీయం చేయొద్దని హితవు పలికారు. సినిమా నటుడు కాబట్టి పవన్ కళ్యాణ్‌ను చూసేందుకు జనాలు వస్తారన్నారు. అది చూసి ఉబ్బిపోయి ఎవరో కేంద్ర నిఘా విభాగం వాళ్లు చెప్పారంటూ ఇష్టమొచ్చినట్లు మహిళలను కించపరిచేలా మాట్లాడటం సరికాదన్నారు. రాజకీయ వ్యవస్థను చక్కదిద్దాలంటే ముందు హుందాగా వ్యవహరించడం నేర్చుకోవాలని హితవు పలికారు. రాష్ట్రంలో 14 వేల మంది అమ్మాయిలు మిస్సింగ్ అయ్యారని పవన్ కళ్యాణ్ చెబుతుంటే పత్రికల్లో మాత్రం 29 వేల మంది అని రాశారని, అయినా అంత మంది అమ్మాయిలు మిస్సింగ్ అవుతుంటే తల్లిదండ్రులు ఎందుకు ఫిర్యాదు చేయడంలేదని ప్రశ్నించారు. మీ దగ్గర ఆధారాలుంటే పోలీసులకు ఫిర్యాదు చేయాలని లేదా న్యాయస్థానానికి సమర్పించాలని సూచించారు. ఈ అంశంపై డీజీపీ ప్రత్యేక చొరవ తీసుకుని పవన్ కళ్యాణ్‌ను పిలిపించుకుని వివరాలు రాబట్టుకోవాలని, తప్పుడు సమాచారమైతే చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

బస్సు ఢీ కొని వృద్ధుడి మృతి



గాయపడిన నరసింహప్ప

పుట్టపర్తి టౌన్: ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటనలో ఓ వృద్ధుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... మండలంలోని బ్రాహ్మణపల్లికి చెందిన చాకలి చిన్న నరసింహప్ప (75)బెంగళూరులోని తన కుమార్తె వద్దకు వెళ్లేందుకు సోమవారం ఉదయం 10 గంటలకు పుట్టపర్తి ఆర్టీసీ బస్టాండ్‌కు చేరుకున్నాడు. బస్సు లేకపోవడంతో పక్కనే ఉన్న హోటల్‌కెళ్లి టీ తాగి, బిస్కెట్లు కొనుగోలు చేసి తిరిగి వస్తుండగా పుట్టపర్తి నుంచి హిందూపురం వెళుతున్న ఆర్టీసీ అద్దె బస్సు ఢీకొంది. ఘటనలో తలకు బలమైన గాయం కావడంతో అపస్మారక స్థితికి చేరుకున్న నరసింహప్పను స్థానికులు వెంటనే సత్యసాయి సూపర్ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆయన మృతిచెందినట్లు నిర్ధారించారు. ఘటనపై దర్యాప్తు చేపట్టినట్లు సీఐ బాలసుబ్రహ్మణ్యం రెడ్డి తెలిపారు.

వాహనం ఢీకొని ఇద్దరి మృతి



చక్రవర్తి (ఫైల్)



కాంతరాజు (ఫైల్)

మడకశిర రూరల్: మండలంలోని ఆమిదాలగొంది గ్రామం వద్ద ఆదివారం అర్ధరాత్రి జరిగిన ప్రమాదంలో మడకశిరకు చెందిన చక్రవర్తి (24), కాంతరాజు (25) మృతి చెందారు. పావగడ నుంచి ద్విచక్ర వాహనంలో వస్తుండగా వెనుక నుంచి వేగంగా దూసుకొచ్చిన గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఇద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. ప్రమాదానికి కారణమైన డ్రైవర్ వాహనాన్ని ఆపకుండా ఉడాయించాడు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

పాముకాటుతో వృద్ధురాలి మృతి




వెంకటలక్ష్మి (ఫైల్)

ఉరవకొండ: మండలంలోని వై.రాంపురం నివాసి వెంకటలక్ష్మి (70) పాముకాటుతో మృతి చెందింది. ఈ నెల 8న తన మనవరాలితో కలసి పొలం పనులు చేస్తున్న సమయంలో పాముకాటు వేసింది.విషయం తెలుసుకున్న ఆమె కుమారుడు లాలెప్ప తక్షణమే ఆమెను ఉరవకొండలోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లాడు. ప్రథమ చికిత్స అనంతరం వైద్యుల సూచన మేరకు అనంతపురంలోని సర్వజనాస్పత్రికి తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ సోమవారం ఆమె మృతి చెందింది. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

పోలీస్ స్పందనకు 60 వినతులు

పుట్టపర్తి టౌన్: జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి వివిధ సమస్యలపై 60 వినతులు అందాయి. ఎస్పీ మాధవరెడ్డి స్వయంగా అర్జీదారులతో వినతులు స్వీకరించి, సమస్య తీవ్రత అడిగి తెలుసుకున్నారు. చట్టపరిధిలోని సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత స్టేషన్ హౌస్ ఆఫీసర్లను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ విష్ణు, లీగల్ అడ్వైజర్ సాయినాథరెడ్డి పాల్గొన్నారు.

వృద్ధురాలి కమ్మలు అపహరణ



బాధితురాలు మహబూబ్బీ

ముదిగుబ్బ: మాటలతో మభ్య పెట్టి వృద్ధురాలి చెవిలోని బంగారు కమ్మలను అపహరించుకెళ్లిన ఘటన సంచలనం రేకెత్తించింది. బాధితురాలు తెలిపిన మేరకు... ముదిగుబ్బలో నివాసముంటున్న సత్తార్ సాహెబ్ భార్య మహబూబ్బీకి సాంకేతిక కారణాల రీత్యా రెండేళ్లుగా పింఛన్ అందడం లేదు. ఈ విషయం పసిగట్టిన ఓ యువకుడు సోమవారం వృద్ధురాలి వద్దకు చేరుకుని పింఛన్ మొత్తం రూ.50 వేలు వచ్చిందని, తనకు రూ.10 వేలు చెల్లిస్తే ఈ డబ్బు ఇప్పిస్తానని నమ్మబలికాడు. అయితే తన వద్ద అంత డబ్బు లేదని వృద్ధురాలు తెలపడంతో మాటల్లో పెట్టి చెవిలోని మరకమ్మలు చూసి స్నానడంతో ఆమె తీసిచ్చింది. వాటిని చేజిక్కించుకున్న వెంటనే యువకుడు తన ద్విచక్ర వాహనంపై ఉడాయించాడు. ఆ సమయంలో ఆమె కేకలు వేసిన ప్రయోజనం లేకపోయింది. ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు బాధితురాలు తెలిపింది.

నీటి సంపులో పడి బాలుడి మృతి



టిల్లు

నర్మెట: ఆడుకుంటూ వెళ్లి ఓ బాలుడు నీటి సంపులో పడి మృతిచెందాడు. ఈ ఘటన జనగామ జిల్లా నర్మెట మండలం వెల్దండలో జరిగింది. స్థానికుల కథనం ప్రకారం కదిరి మండలం ఎర్రదొడ్డి గ్రామానికి చెందిన సిందే బ్రహ్మయ్య, సంధ్య దంపతులతోపాటు మరో కుటుంబం గ్రామాలలో సర్కస్ చేస్తూ సంచార జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో శనివారం వెల్దండకు చేరుకున్న వీరు.. రెండు రోజులుగా విన్యాసాలు చేస్తున్నారు. సోమవారం ఉదయం పెద్దలు గ్రామంలోకి వెళ్లగా పిల్లలతో ఆడుకుంటూ వెళ్లిన టిల్లు (2) నీటి సంపులో పడ్డాడు. ఆలస్యంగా వచ్చిన బ్రహ్మయ్య బాలుడి జాడ కోసం వెతుకుతూ అనుమానంతో సంపులోకి చూడగా అందులో కనిపించాడు. దీంతో వెంటనే జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు తెలిపారు.